# గడియారం వెనక్కి తిరిగింది

## స్వగతంబు

అనగా అనగా ఒక వూరు.

ఆ వూళ్లో ఒక పెద్ద గడియారం. వూరంతా కన్పించేటంత ఎత్తుగా కట్టిన ఆ క్లాక్‌టవర్ మీద గడియారం నాలుగు వైపులా కన్పిస్తుంది. గడియారం గంటలు వూరంతా విన్పిస్తాయి.

వున్నట్టుండి ఆ గడియారం ఒక రోజున వెనక్కి తిరగడం మొదలు పెట్టింది.

వూళ్ళో వాళ్ళంతా వెనక్కి తిరుగుతున్న గడియారాన్ని చూసి విస్తుపోయారు. పత్రికలవాళ్ళు పరిగెట్టుకుంటూ వచ్చి "వెనక్కి తిరుగుతున్న వింత గడియారం కథ" అని రాసుకుపోయారు.

ఆ గడియారం కింద వున్న ఆఫీసులో పెద్దాఫీసర్ శ్రీ రూల్సు రామారావుగారికి గడియారం వెనక్కి తిరగడం చికాకు కల్గించింది. ప్రజలు, పత్రికలవాళ్ళు వేలం వెర్రిగా వచ్చి వేలాది ప్రశ్నలు వెయ్యడం ఆయనకి మరింత కోపాన్ని కల్గించాయి.

ఎలాగైనా గడియారాన్ని ఆపడానికి ఆయన సకల ప్రయత్నాలూ చేశారు. అసలే రూల్సు ప్రకారం నడుస్తూ, మాట్లాడితే సూక్తి ముక్తావళిలా రూల్సే మాట్లాడుతూ వుండే రూల్సు రామారావుగారు గడియారం వెనక్కి తిరగడం భరించలేకపోయారు. స్విట్జర్లాండునుంచి నిపుణుల సంఘం వారొచ్చినా ప్రయోజనం లేకపోయింది.

గడియారం ఆగలేదు. ఎవరూ ఆపలేకపోయారు. వెనక్కి తిరుగుతూనే వుంది.

గడియారం ఎందుకు వెనక్కి తిరుగుతోందో ఎవరికీ అర్థం కాలేదు. శాస్త్రజ్ఞులు కూడా సరైన సంజాయిషీ ఇవ్వలేకపోయారు

"ఇదంతా నా మహత్యం! ఈ గడియారం ఏడేళ్ళపాటు ఇలాగె వెనక్కి తిరుగుతుంది. ఎవరూ ఆపలేరు" అని యవ్వనానంద స్వామి వారు పత్రికా ప్రతినిధుల గోష్ఠిలో తెలియచేశారు.

గడియారాన్ని వెనక్కి నడిపిస్తూన్న యవ్వనానందస్వామి మహత్యం ప్రజల్ని, పత్రికల్ని, విదేశీయుల్నికూడా ఆకర్షించింది. పర్యవసానంగా యవ్వనానంద స్వామిపట్ల ప్రజల్లో భక్తి కలరా వ్యాధిలా ఉధృతంగా వ్యాపించసాగింది.

గడియారం వెనక్కి తిరగడం కొనసాగిస్తూనేవుంది.

రూల్సు రామారావుగారు గడియారం విషయం పట్టించుకోడం మానేసి జుట్టుకి రంగు వేసుకోసాగారు. రెండేళ్ళలో రిటైరై పోవాల్సిన రామారావుగారు కొత్త ప్రమోషన్ లభించి మరింత యవ్వనవంతులై వర్తిల్లసాగారు.

గడియారం వెనక్కి తిరగడానికి రూల్సు రామారావుగారు రిటైర్ అవ్వకపోడానికి, యవ్వనానందస్వామి మహత్యానికి ఏదైనా సంబంధం వుందా అని కొందరికి అనుమానం వచ్చింది.

తమ్ముడు రిటైరైపోయినా రూల్సు



రామారావుగారు సర్వీసులో కొనసాగడం; నలభై ఏళ్ళ కూతురు, పాతికేళ్ళ మనవడు వున్న శ్రీ రూల్సు రామారావుగారికి ఇప్పుడు కేవలం నలభై తొమ్మిదేళ్ళేనని తెల్సుకునేసరికి ప్రజల్లోనూ, పత్రికల్లోనూ కలకలం బయల్దేరింది.

భక్తులుగా చేరిపోయి బయటపడలేక శ్లేష్మంలో ఈగల్లాగ కొట్టుకుచస్తున్న కొందరు అనుమానం భక్తులు వెళ్ళి "స్వామీ! నలభై ఏళ్ళ కూతురు, పాతికేళ్ళ మనవడు వున్న రూల్సు రామారావుగారికి నలభైతొమ్మిదేళ్ళే ఎలా వుంటాయి స్వామీ! అదీ తమ మహత్యమేనా" అని యవ్వనానందస్వామివారిని అడిగారు.

"అవును. అదీ నా మహత్యమే! రూల్సు రామారావు నా భక్తుడు. ఆఫీసులో అష్టమాసం రూల్సు పట్టుకు వేళ్ళాడే రామారావు జీవితంలో డబుల్ రూల్సు మధ్య అక్షరాల్లా ఇద్దరి భార్యల మధ్య నలిగిపోయి రిటైరైపోయాడు. అందుకే రిటైరైపోకుండా పునర్జన్మ ఇచ్చాను.

రూల్సు పట్టుకుని వేళ్ళాడడం మానేసి నా కాళ్ళు పట్టుకున్నాడు. సరేనని కరుణించి దివ్యదృష్టితో చూసి అతని పునర్జన్మలో పుట్టినరోజు తేదీ చెప్పాను. మున్సిపాల్టీ మొదలు హైకోర్టుదాకా నా భక్తులున్నారు కదా! రూల్సు రామారావు కొత్తపుట్టిన రోజుతో కొత్తజీవితాన్ని ప్రారంభించారు. ఇంకా ఏడేళ్ళ సర్వీసువుంది. అందుకే ఆ ఆఫీసులో గడియారం మరో ఏడేళ్ళు వెనక్కి తిరుగుతుంది" అని స్వామీజీ సెలవిచ్చారు.

ఈ కథ విన్న ఒక కుర్ర గుమాస్తా ఆవేశం ఆపుకోలేక "ఆఫీసు వ్యవహారాల్లో స్వామీజీల జోక్యం నశించాలి! అధికార దుర్వినియోగం అరికట్టాలి. గడియారాలు వెనక్కి తిరగడం ఆపుచెయ్యాలి" అని నినాదాలు లేవదీసి "గడియారం వుద్యమం" ప్రారంభించాడు.

ప్రజలు, పత్రికలుకూడా చేతులు కలపడంతో వుద్యమం వేగాన్ని పుంజుకుని ప్రభుత్వం గడియారం వెనక్కి తిరగడం మీద ఒక "గడియారం కమిషన్"ని నియమించవలసి వచ్చింది.

కానీ యవ్వనానందస్వామి మహిమవల్ల "గడియారం కమిషన్"లో భక్తులే నియమింపబడ్డారు.

పర్యవసానంగా కమిషన్ దర్యాప్తు నివేదికలకు కాలదోషం పట్టింది. గడియారం వెనక్కి తిరగడం మానలేదు.

యవ్వనానందస్వామి ఆగ్రహానికి గురైన కుర్ర గుమాస్తా గడియారం వుద్యమాన్ని ప్రారంభించినందుకు ప్రతీకార చర్యగా వెంటనే దూరప్రాంతానికి బదిలీ చెయ్యబడి, అటు పిమ్మట కొత్త నేరాలు మోపబడి, వుద్యోగం పోగొట్టుకున్నాడు. స్వామి వారి భక్తుల కక్ష సాధింపు చర్యలకి బలైపోయాడు.

గడియారం మాత్రం ఇంకా వెనక్కి తిరుగుతూనే వుంది. డబుల్ రూల్సు రామారావుగారు జుట్టుకి రంగు వేసుకుంటూనె వున్నారు.

[నీతి : ప్రజల్ని ముందుకు తీసుకువెళ్ళే గడియారాలు కావాలి.]

—తంబు